క్లుప్తంగా

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించిన భక్తులు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శ్రీపార్వతీ అమ్మవారికి శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు. గ్రామంలో ఉదయం బోసుబొమ్మ సెంటర్ నుంచి ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, విజయలక్ష్మి దంపతులు మేళ తాళాలు, కోలాటం, మంగళ వాయిద్యాలతో సారె తీసుకు వచ్చి దేవస్థానంలో అమ్మవారికి సమర్పించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు జీవీఆర్ సాగర్, ఈవో గంగాధరరావు వారికి ఆహ్వానం పలికి ఆలయంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివసాథంలో శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి ట్రస్టు ఆధ్వర్యంలో దాదాపు 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

సైక్లిస్టుకు గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలవటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ చిట్టినగర్‌కు చెందిన చెరుకూరి నారాయణ తాడిగడపలో బంధువుల ఇంటికి సైకిల్‌పై బయలుదేరి,కానూరు ఇంజినీరింగ్ కాలేజీ వద్దకు రాగా లారీ అతనిని ఢీ కొట్టింది.ఈ ఘటనలో నారాయణ గాయపడటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకు చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నున్న(విజయవాడరూరల్): నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నున్న, పాతపాడు, విలేజి కండ్రిక, వెంకటాపురం, అప్పారావు పేట,గ్రామాలతో పాటు మ్యాంగోమార్కెట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం హనుమాన్‌జంక్షన్ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ సీపీడీసీఎల్ ఏఈ ఎ.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక హనుమాన్ నగర్, వేలేరు రోడ్డు, రాజుల కాలనీ, విజయవాడ రోడ్డు ఏరియాల్లో ఉదయం 7 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రైవేట్ స్కూల్ తనిఖీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రైవేట్ స్కూళ్లలో ప్రభుత్వ నిబంధనల మేరకు రికార్డులు నిర్వహించాలని బాపులపాడు ఎంఈవో రామ్ బాలాసింగ్ చెప్పారు. స్థానిక విజయవాడ రోడ్డులోని నారాయణ స్కూల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాల నిర్వహణకు జారీ చేసిన ప్రభుత్వ అనుమతి ఉత్తర్వులు, తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్య వివరాలను తల్లిదండ్రులందరికీ కనిపించే విధంగా నోటీసు బోర్డులో పెట్టాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులకు అందించాల్సిన రిపోర్టులను సకాలంలో నిర్వహించాలని, స్కూల్ అటెండెన్స్ యాప్, యుడైస్ ప్లస్‌లో విద్యార్థుల వివరాలను తప్పక నమోదు చేయాలన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు రక్ష



సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి



ప్రొద్దుటూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి



కొండపావులూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ అనగాని

ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

పెనమలూరు: జగనన్న సురక్ష ప్రజలకు రక్షణ ఇచ్చే కార్యక్రమమని ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. పెనమలూరు గ్రామంలో శుక్రవారం సచివాలయం 3లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ జగనన్న సీఎం అయిన తరువాత పరిపాలన ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. దీని కారణంగా సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాయని తెలిపారు. జగనన్న సురక్ష పథకంతో ప్రతి ఇంటికి సర్వే చేసి వారికి ఉన్న సమస్యలు సత్వర పరిష్కారం చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజలు అందుబాటులో ఉండి సుపరిపాలన అందిస్తుందన్నారు. పెనమలూరు గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు మాట్లాడుతూ గ్రామంలో గ్రామస్తుల సమస్యలు ఇంటింటికీ సర్వే చేసి తెలుసుకుని జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కారం చేశామన్నారు. గ్రామాభివృద్ధితో పాటు ,గ్రామ సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వివరించారు. ఈ సందర్భంగా 222 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, ఏవో లోయ శివశంకర్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఎంఈవో శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ నేతలు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, తెన్నేటి ప్రకాష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

ఉయ్యూరు: జగనన్న సురక్షతో సత్వర పౌరసేవలు అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. మున్సిపాలిటీలోని 15, 16 వార్డుల పరిధిలోని కాకాని గిరిజన కాలనీ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 230 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు పూర్తిగా వినియోగించుకుంటున్నారన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో ప్రజల ఇబ్బందులు పరిష్కారం అవుతున్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ మరోసారి సీఎం జగన్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, కల్యాణి పాల్గొన్నారు.

మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 412 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి, ఎంపీడీఓ విమాదేవి, తహసీల్దార్ మస్తాన్ పాల్గొన్నారు.

గన్నవరం రూరల్ : ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ అనగాని రవి అన్నారు. శుక్రవారం కొండపావులూరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వలంటీర్‌లు, సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేసి, యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించి, కోట్లాది మందికి గ్రామ స్థాయిలో సేవలన్ని అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదని కొనియాడారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వానికి అండగా నిలవాలని చెప్పారు. ఈ సందర్భంగా 535 వివిధ రకాల సర్టిఫికెట్లను గ్రామస్తులకు అందజేశారు. సర్పంచి ఉప్పుగంటి పద్మజ, ఎంపీడీవో సత్యకుమార్, గోపవరపుగూడెం సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, సహకార బ్యాంకు అధ్యక్షుడు కంచర్ల నాగబాబు, పంచాయితీ కార్యదర్శి శ్రీనువణేష్, డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌బాబు, ఉప్పుగంటి రాజేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారం చేస్తామని టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ కానూరు సచివాలయం1లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు నేరుగా గ్రామాల్లో ప్రజల ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కారం చేస్తున్నారని వివరించారు. తాడిగడప కమిషనర్ ఎస్.ప్రకాశరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలో సమర్థంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే సచివాలయాల పరిధిలో అనేక సమస్యలు పరిష్కారం చేశామని తెలిపారు. కానూరు 1లో 155 మందికి సర్టిఫికెట్లు జారీ చేశారు. కార్యక్రమంలో సచివాలయాల ఇన్‌చార్జ్‌లు చాంద్‌బాషా, వేమూరి బాలకృష్ణ, ఎండీ సిద్దిఖ్, నేతలు తాళ్ల నరేంద్ర, అంగిరేకుల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

కంకిపాడు: జగనన్న సురక్ష పేదలకు గొప్ప వరమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజలకు సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈడే శివనాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు బి.సురేష్, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమవరపు నాగిరెడ్డి, భీమవరపు రమేష్‌రెడ్డి, భీమవరపు రాజగోపాల్‌రెడ్డి, రాజబోయిన ప్రసాద్, బీహెచ్ గిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కానూరులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న టిడ్కో డైరెక్టర్ రాఘవరావు

గన్నవరం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలను అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు వీఎస్. పురం కాలనీలోని గ్రామసచివాలయం–2లో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే, పలువురు ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో అర్హులకు అన్యాయం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ అర్హత ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తూచ తప్పకుండా అమలు చేసి చూపించారని తెలిపారు. ప్రజలకు ఇంతగా మేలు చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌ను నిండు మనస్సుతో ఆశీర్వాదించాలని కోరారు. గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.గౌసాని, తహసీల్దారు సీహెచ్. నరసింహారావు, ఈవో మౌనిక, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

3డి ప్రింటింగ్ టెక్నాలజీతో కాంక్రీట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీలో ప్రప్రథమంగా నెలకొల్పిన 3డి ప్రింటింగ్ టెక్నాలజీతో కాంక్రీట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న కేసీపీ వైస్ ప్రెసిడెంట్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ 3డి ప్రింటింగ్ టెక్నాలజీతో కాంక్రీట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో నిర్మాణ రంగంలో సాంకేతిక అభివృద్ధి సాధించగలుగుతామన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అధునాతన ప్రయోగశాలలు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్, కాంక్రీట్ టెక్నాలజీలో పరిశోధనలతో సివిల్ ఇంజినీరింగ్ రంగంలో పెను మార్పులు తీసుకు రావచ్చన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిసారిగా తమ కాలేజీలో 3డి ప్రింటింగ్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశామన్నారు. సివిల్ ఇంజినీరింగ్ చదువున్న విద్యార్థులు ఆచరణాత్మకమైన నైపుణ్యం, పరిశ్రమలకు అవసరమైన టెక్నాలజీ పెంపొందించుకోవటానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కాలేజీ కన్వీనర్ మలినేని రాజయ్య, డీన్ పాండురంగారావు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి చావా శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ

కంకిపాడు: డెంగీ వ్యాధిపై అవగాహన అవసరమని ఆప్తాల్మిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గాంధీనగర్‌లో శుక్రవారం డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, సీహెచ్‌ఎం మార్తమ్మ, ఆరోగ్య సిబ్బంది రాజకుమారి, జయలక్ష్మి, కనకదుర్గ, షేక్ నాగూర్‌బి, చందన పాల్గొన్నారు.

డ్రైడే పాటించాలి

గన్నవరం రూరల్ : గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది డ్రైడే నిర్వహణపై శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు అన్నారు. చనుపల్లివారిగూడెంలో స్థానిక ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో తప్పక డ్రైడే పాటించాలన్నారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించటం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. దోమల వ్యాప్తికి అనుకూలంగా ఉన్న ప్రదేశాలు గుర్తించి దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రచారం చేశారు.

కొమ్మ కత్తిరింపు చర్యలు చేపట్టాలి

మామిడి రైతులకు శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి సూచన

నున్న(విజయవాడరూరల్): మామిడి సీజన్ పూర్తి అయిన పిమ్మట మామిడి రైతులు మామిడిచెట్ల కొమ్మ కత్తిరింపునకు చర్యలు చేపట్టాలని మామిడి పరిశోధన కేంద్రం ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త బి.కనక మహాలక్ష్మి అన్నారు. శుక్రవారం నున్న గ్రామంలో రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మామిడి తోటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై కనకమహాలక్ష్మి మాట్లాడుతూ మామిడి చెట్లలో దట్టంగా పెరిగిన కొమ్మలను కత్తిరించాలన్నారు. చెట్లకు గాలి, వెలుతురు వచ్చే విధంగా చూసి కొమ్మలను కత్తిరించినట్టయితే సూర్యరశ్మి చెట్లకు, వేరులకు చేరుతుందన్నారు. ఎండుకొమ్మలను పూర్తిగా తొలగించాలని రైతులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, గ్రామ సొసైటీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి బాలాజీకుమార్, విజయవాడ ఉద్యానశాఖ అధికారి పరమేశ్వరరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తాడిగడప విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో సీటు

పెనమలూరు: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి పాస్ అయిన విద్యార్థిని అశ్వదాటి వరలక్ష్మికి ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కనకదుర్గ శుక్రవారం వివరాలు తెలిపారు. తాడిగడప పాఠశాలలో పదవ తరగతి చదివిన అశ్వదాటి వరలక్ష్మికి 569 మార్కులు వచ్చాయని, ఆమెకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా వరలక్ష్మిని పాఠశాలలో ఘనంగా సత్కరించారు.

మణిపూర్‌లో శాంతిస్థాపనకు చర్యలు తీసుకోవాలి



కంకిపాడు: మణిపూర్‌లో శాంతి స్థాపనకు పాలకులు చర్యలు తీసుకోవాలని పెనమలూరు నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జాన్‌క్రాస్ విజ్ఞప్తిచేశారు. మణిపూర్‌లో శాంతి స్థాపన కాంక్షిస్తూ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు కంకిపాడు పట్టణంలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరారు. ఫెలోషిప్ కార్యదర్శి సీహెచ్ స్టీఫెన్ మాట్లాడుతూ క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరోధించాలన్నారు. కార్యక్రమంలో సొంగ యోనా, ఫెలోషిప్ ప్రతినిధులు రాజేష్, డానియేల్, బిషప్ సాల్మన్‌రాజు, బిషప్ ఏలియా రాజు, బిషప్ షడ్రక్, తదితరులు పాల్గొన్నారు.

తూటికాడ తొలగింపు



విజయవాడరూరల్: మండలంలో అనేక గ్రామాల నుంచి ప్రవహించే బుడమేరు కాల్వలో దట్టంగా పేరుకుపోయిన తూటికాడను తొలగించే చర్యలను ఇరిగేషన్‌శాఖ చేపట్టింది. ఈలప్రోలు గ్రామం నుంచి రామవరప్పాడు గ్రామం వరకు 24 కిలోమీటర్ల మేర తూటికాడను తొలగిస్తున్నట్టు ఇరిగేషన్ అసిస్టెంటు ఇంజినీరు బి.రాజశేఖర్ తెలిపారు. తూటికాడను తొలగించడం వలన వర్షాలు కురిసినప్పుడు బుడమేరు ముంపు నుంచి పంట పొలాలకు రక్షణ కలుగుతుందన్నారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ గ్రాంటు రూ.30 లక్షలతో బుడమేరు కాల్వలో తూటికాడను తొలగింపు పనులు నిర్వహిస్తున్నామన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గన్నవరం: మండలంలోని అల్లాపురంలో క్రాస్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ట్రస్టు చైర్మన్ ఏ రమేష్‌పాల్ తెలిపారు. షుగర్, బీపీ, నేత్ర, దంత, గుండె, గైనకాలజీ, ఆర్థోపెడిక్, చిన్న పిల్లల వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు. పరిసరా గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు రిటైర్డ్ ఉద్యోగులకు..

స్థానిక బుద్ధవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా భవన్‌లో శనివారం మాక్స్‌విజన్ కంటి హాస్పటల్, కృష్ణసాయి దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆవుటపల్లి శివప్రసాద్ తెలిపారు. ఈ అవకాశాన్ని రిటైర్డ్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమ్మవారికి పొంగళ్ల సమర్పణ

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో శ్రీ లక్ష్మీతిరుపతమ్మకు శుక్రవారం భక్తులు గ్రామ పొంగళ్లు సమర్పించారు. తొలుత అమ్మవారి సన్నిధిలో భక్తులు శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిపారు. శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. గ్రామ పొంగళ్లను ఆలయ ప్రదక్షిణ తర్వాత భక్తులు అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని మానుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, పలువురు పుర ప్రముఖులు హాజరయ్యారు.



అమ్మవారికి గ్రామ పొంగళ్లు తీసుకువెళ్తున్న భక్తులు

దివ్యాంగుల పాఠశాలలకు వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: అనాథ, దివ్యాంగ బాలలకు విద్యాబుద్ధులు అందిస్తున్న ఆశాజ్యోతి, ఆదిత్య సంస్థల నిర్వాహకులు అభినందనీయులని దాత వీరం జ్ఞానేశ్వరరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆశాజ్యోతి వికలాంగుల సొసైటీ, ఆదిత్య బధిరుల విద్యాశిక్షణాలయంలో ఆశ్రయం పొందుతున్న దివ్యాంగులకు ప్రతి నెలా రెండు దఫాలుగా ఏడాది పాటు కోడిగుడ్లు అందించేందుకు దాత వీరం జ్ఞానేశ్వరరావు రూ.20 వేలు వితరణ చేశారు. ఆ విధంగా ప్రతి ఏటా అందిస్తానని చెప్పారు. ఆశాజ్యోతి, ఆదిత్య సంస్థలకు 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు.

తిరుపతమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని తిరుపతమ్మ తల్లి, అంకమ్మ తల్లి అమ్మవార్లను పలురకాల కూరగాయాలు, ఆకుకూరలతో శాకంబరి దేవిగా విశేషంగా అలంకరణ చేశారు. తొలుత వేణుగోపాల స్వామి దేవస్థానం నుంచి అధిక సంఖ్యలో మహిళలు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా బయలు దేరి తిరుపతమ్మ తల్లి ఆలయానికి విచ్చేశారు. అమ్మవారి ఆషాఢం సారె, పొంగళ్లను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నందమూరి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



శాకంబరి అలంకరణలో తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి వార్లు